
ప్రజాశక్తి

5

శనివారం 12 జులై 2025

అల్లూరి సీతారామరాజు



కాఫీ రైతులకు బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-జీకే వీధి : మండలంలో జీకే వీధి పంచాయతీ కొత్తపల్లి గ్రామమునకు చెందిన కాఫీ రైతులకు సుమారు 20 లక్షల పైబడి కాఫీ బకాయిలు చెల్లించాలని రైతులు తెలిపారు. జీసీసీ ఆఫీసుకి పలుమార్లు వెళ్లగా వేస్తామంటూ నిర్లక్ష్యం చేశారని రైతులు పేర్కొన్నారు. పాడేరు ప్రజావాణిలో కలెక్టర్ కి వినతి పత్రం ఇవ్వగా డిఎం విచారణ చేపట్టి రెండు మూడు రోజుల్లో అకౌంట్లో డబ్బులు జమ చేస్తామని చెప్పారన్నారు. ఎంక్వైరీ చేసి పది రోజులు అవుతుందన్నారు. తం అకౌంట్లో డబ్బులు జమ కావడం లేదని రైతులు వాపోయారు. కలెక్టర్ తక్షణమే స్పందించి రైతులకి జీసీసీ ద్వారా రావాల్సిన డబ్బులను తమ ఎకౌంట్లో జమ చేయాలన్నారు.



బకాయి స్లిప్పులను చూపుతున గిరిజనులు

జిల్లాల్లోని ప్రతి మండలానికీ..

100 గోకులాలు ఏర్పాటు చేయాలి

-గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి



మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-పాడేరు : జిల్లాలో మండలానికి 100 గోకులాలు ఏర్పాటు చేయాలని, ఆర్వో ఎఫ్ఆర్ పట్టాలు పంపిణీకి చర్యలు తీసుకోవాలని గిరిజన ప్రాంతంలో వైద్య సదుపాయాల పెంపొందించాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి జిల్లా ఇంచార్జ్ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అధికారులకు ఆదేశించారు శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్వర్ణంధ్రా విజన్ 2047, పి4 పై జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్, ఎస్పీ జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్, జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్, రంపచోడవరం శాసన సభ్యులు మిరియాల శిరీషా దేవి, డివిజనల్ అటవీ అధికారి పి వి సందీప్ రెడ్డి, జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, ఎపి ఎస్. ఆర్టిసి రీజనల్ చైర్మన్ ఇంచార్జ్ అరకువాలీ సిరియా దున్ను దొర, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, బంగారు కుటుంబం – మార్గదర్శి కార్యక్రమాన్ని గొప్ప మనసుతో ఆలోచించి ముఖ్య మంత్రి అమలులోకి తీసుకువచ్చారని అన్నారు. ఉన్నత ఆశయాలు ఉన్నవారు మార్గదర్శిగా ఉండుటకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మార్గదర్శిగా ఉన్నవారు ధన సహాయం మాత్రమే చేయాల్సిన అవసరం లేదని, వారికి ఉండే విజ్ఞానాన్ని అందించడం, మంచి స్ఫూర్తి కల్పించడం, మంచి అవకాశాలు తెలియజేయడం వంటి అనేక కార్యక్రమాలు చేపట్టి వారి ఉన్నతికి తోడ్పాటు అందించాలని సూచించారు. బంగారు కుటుంబాలు గుర్తించి నప్పుడు వారు చాలా నిరుపేదలై ఉండేలా చూసుకోవాలన్నారు. అటువంటి కుటుంబాలవారికి ఆర్థికంగా అండగా ఉండి తద్వారా వారు ఆదాయం ఎలా సమాకుర్చుకోవాలో వారికి అవగాహన కల్పించాలన్నారు. పిల్లలకు గైడెన్స్ ఇచ్చి వారు మంచి కోర్సులు చదివి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా సహాయాన్ని అందించాలన్నారు. పర్యాటకుల సౌకర్యాల నిమిత్తం పర్యాటక అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. గిరిజనుల అభివృద్ధికి ఐటిడిఎ సబ్సిడీలు అందజేయాలన్నారు. ఆర్గానిక్ పంటలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు అందించే దిశగా త్వరితగతిన చర్యలు చేపట్టాలన్నారు.గిరిజన ప్రాంతాల్లో వైద్యం ప్రతీ ఒక్కరికి తప్పనిసరిగా అందేలా ఆసుపత్రుల్లో వైద్యులతో పాటు వైద్య పరికరాలు, మందులు తప్పక అందుబాటులో ఉండాలన్నారు. ముందుగా జిల్లా కలెక్టర్ జిల్లా ప్రొఫైల్ పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా విజన్ ఆంధ్రా 2047 నాటికి చేయవలసిన పనులు అందునిమిత్తం చేపట్టిన ప్రణాళికలు వివరించారు. రానున్న 2029 నాటికి 15 శాతం గ్రోత్ రేటు పెంచేందుకు చేపడుతున్న ప్రణాళికలు, జిల్లా ఆర్థిక ప్రణాళికలు, వ్యవసాయ, ఉద్యాన, కాఫీ, పరిశ్రమలు తదితర అంశాలను వివరించారు. రానున్న 5 సంవత్సరాలలో విడతల వారీగా పూర్తి స్థాయిలో ఆర్గానిక్ పంటలు ఉత్పత్తులపై ప్రణాళికలు రూపొందించుకోవడం జరిగిందన్నారు. దేశంలో అరకు కాఫీ మాత్రం ఆర్గానిక్ కాఫీ అన్నారు. పి 4 గోడప్రతిని అతిథులు విడుదల చేశారు. ఈ సమీక్షా సమావేశానికి ఇంచార్జి డిఆర్ఓ ఎం.వి.ఎస్ లోకేశ్వరరావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్. బి. ఎస్. నంద్, జిల్లా ఉద్యాన వన అధికారి ఎ.రమేష్ కుమార్‌రావు, జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మజీరావు, డ్వామా పిడి విద్యాసాగర్, డిఆర్డిఏ పిడి వి.మురళి పాల్గొన్నారు.

టూరిజం ఆదాయాన్ని స్థానికంగా ఖర్చు చేయాలి

- గుడిస గ్రామానికి కనీస సౌకర్యాలు కల్పించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



ఐటిడిఎ అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-మారేడుమిల్లి

ఏజెన్సీలో టూరిజం ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు కల్పనకు, అభివృద్ధికి ఖర్చు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండలంలోని గుడిస గ్రామం పర్యాటకంగా అభివృద్ధి చెందుతూ రాష్ట్ర, అంతర్ రాష్ట్రాల్లో మంచి పేరు ప్రఖ్యాతలు సాధించుకున్నప్పటికీ ఈ గ్రామంలో మౌలిక సదుపాయాల్లో ఇంకా వెనకబడే ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం శ్రీనివాసరావు గుడిస గ్రామాన్ని సందర్శించి స్థానికులతో ముచ్చటించారు. పలు సమస్యలు శ్రీనివాసరావుకు గిరిజన మహిళలు వివరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో పర్యాటకం ద్వారా వచ్చిన ఆదాయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అధికారులు కాజేశారని, వాటి లెక్కలు ప్రజలకు తెలపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్ల నిర్మాణానికి రూ.12 లక్షలు ఐటీడీఏ ద్వారా నిధులు మంజూరు చేసిందని, కాని రోడ్డు నిర్మాణం చేయకుండా తూతూ మంత్రంగా మట్టి పోసి సరిపెట్టారని తెలిపారు. గుడిస గ్రామస్తులు రేషన్ బియ్యం తీసుకోవడానికి సుమారు 15 కిలోమీటర్లు కొండలు దాటి నడుచుకుంటూ పుల్లంగి వెళ్లవలసి వస్తుందని చెప్పారు. ఆ గ్రామంలో స్కూలు గాని, అంగన్వాడీ కేంద్రం గాని లేవన్నారు. ఐటిడిఎ పర్యాటక గ్రామాల్లో సదుపాయాలపై దృష్టి పెట్టకుండా టూరిజంపై దృష్టి పెడుతుందని విమర్శించారు. టూరిజం ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రామాభివృద్ధికి కేటాయించకుండా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఐటిడిఎ అధికారులు స్పందించి గుడిస గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఆ గ్రామానికి వెళ్లే రోడ్లు వేయాలని, స్కూలు, అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, పార్టీ ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, మండల నాయకులు రాజన్న దొర తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై అవగాహనా ర్యాలీ



మధ్యవర్తిత్వంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - రంపచోడవరం : జ్యుడీషియల్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు నుంచి అంబేద్కర్ సెంటర్ మీదుగా రంపచోడవరం జ్యుడీషియల్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు వరకూ మధ్యవర్తిత్వం యొక్క ప్రయోజనాలపై అవగాహన ర్యాలీ నిర్వహించామని జెఎఫ్‌సి మెజిస్ట్రేట్ ఎం.మురళీగంగాధరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ రాజమహేంద్రవరం ఆదేశాల మేరకు ర్యాలీ అనంతరం కోర్టు ప్రాంగణం నందు మధ్యవర్తిత్వం యొక్క ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. మధ్యవర్తిత్వం ద్వారానే సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం ఈ నెల 10వ తేదీ నుంచి 16వ తేదీ వరకూ నిర్వహించాలని ప్యానల్ అడ్వకేట్స్‌కు మండల న్యాయసేవాధికార సంస్థ పారాలీగల్ వాలంటీర్లకు వ్యక్తం చేశారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి జాతీయ న్యాయసేవాలీగల్ సర్వీసెస్ అథారిటీ టోల్ ఫ్రీ నెంబర్ 15100కు సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ నాగమల్లేశ్వరరావు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భగవాన్, అడ్వకేట్‌ఎం.వి.ఆర్.ప్రకాష్ అడ్వకేట్స్ వై.శ్రీనివాస్, సత్యనారాయణ, గౌరీశంకర్,జిలాని, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ రాజమహేంద్రవరం, మండల న్యాయ సేవాధికార సమస్త పారా లీగల్ వాలంటీర్లు యలగాడ నాగేశ్వరరావు, తెల్లం శేఖర్, కారం రామన్నదొర కోర్టు సిబ్బంది,పోలీసులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో ఇంటి వద్ద రేషన్ పంపిణీ

-ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-అనంతగిరి:మండలంలోని నాన్ షెడ్యూల్ రొంపల్లి పంచాయతీ పరిధి బూరిగ, చిన్నకోనల గ్రామాలకు రేషన్ సరుకులు శుక్రవారం ఇంటింటికి పంపిణీ చేశారు.గిరిజనానికి రేషన్ దూరం అనే కథనం జూన్ నెల 13వ తేదీన ప్రచురణమైన విషయం తెలిసిందే. స్పందించిన రాష్ట్ర సివిల్ సప్లై ఉన్నతా అధికారులు జూన్ 29 తేదీన ఆయా గ్రామాల్లో సందర్శించి స్థానిక గిరిజనులు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇంటి వద్ద రేషన్ పంపిణీ చర్యలు తీసుకున్న నేపథ్యంలో ఈ నెల నుండి బూరిగ 41 చిన్న కోనల 34 రేషన్ లబ్దిదారులకు స్థానిక జిసిసి అధికారులు శుక్రవారం పంపిణీ కార్యక్రమం చేపట్టారు. దీంతో అధికారులకు స్థానిక గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు.ఎన్ఆర్ పురం పంచాయతీ పరిధి కొండ శిఖరు గ్రామమైన సిమిడివలస, రాయపాడు, బొంగిజా తదితర గ్రామాలకు చెందిన 68 మంది లబ్ధిదారులకు కూడా గ్రామాల్లోనె రేషన్ పంపిణి చేసేందుకు అధికారులు హామీ ఇచ్చారని, తక్షణమే తమ గ్రామాల్లోనే పంపిణీ చెయ్యాలని గిరిజనులు కోరుతున్నారు.



గ్రామంలో రేషన్‌ను తీసుకొచ్చిన కూలీలు

కడుపునొప్పితో బాలింత మృతి

ప్రజాశక్తి - కొయ్యూరు: గిరిజన ప్రాంతాల్లో రోడ్డు సౌకర్యం లేక పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డు సదుపాయం లేక ఓ బాలింత మృతి చెందిన సంఘటన అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం జాజులబంద సమీపంలో మూలపేటలో జరిగింది. బాలింత మర్రి కావ్య (25) గురువారం రాత్రి 11 గంటల సమయంలో కడుపునొప్పి వచ్చింది. చికిత్స చేయించేందుకు తీసుకెళ్లేందుకు రోడ్డు బాగోక అవకాశం లేకపోవడంతో రాత్రి 2 గంటలకు ఆమె మృతి చెందింది. నెలరోజుల క్రితం ఆమెకు బాబు జన్మించాడు. 28 రోజుల వయస్సున్న బాబుతో కావ్య కొన్నాళ్లుగా ఇంటివద్దనే ఉంది. తరచూ కడుపునొప్పి వస్తుండడంతో ఆమెను భర్త కామేష్ డోనూరు ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించారు. తరువాత బాగానే ఉంది అయితే శుక్రవారం మళ్లీ కడుపునొప్పి రావడంతో మృతి చెందింది.

హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌పై ఆందోళన

మూడో రోజు వంటవార్పుతో నిరసన



నిరసన చేపడుతున్న గిరిజనులు

ప్రజాశక్తి- అనంతగిరి:మండలంలోనికి మారుమూల పెద్దకోట పంచాయతీ పరిధి రేగులపాలెం –కొండిబకోట గ్రామాలలో హైడ్రో పవర్ ప్రోజెక్ట్ ఏర్పాటుపై ఆందోళన కార్యక్రమం మూడో రోజుకు చేరుకుంది. హైట్రో పవర్ ప్రోజెక్ట్ కమిటీ పిలుపు మేరకు శుక్రవారంతో మూడో రోజుకు చేరుకుంది. సర్వే బృందం వస్తున్నట్లు సమాచారం అందడంతో పెద్దకోట, రేగుల పాలెం, కొండిబకోటతో పాటు చుట్టుపక్కల గ్రామాల గిరిజనులు రేగులపాలెం– కొండిబకోట సరిహద్దు గోస్తని గెడ్డ వద్ద వంటావార్పు నిర్వహిస్తూ ఆ ప్రాంతం వద్ద పోరాటానికి సన్నద్ధం అయినట్లు కమిటీ సభ్యులు జన్ని. ఈశ్వరరావు. డి. సత్యారావు, సింహాచలంలు తెలిపారు. వారు మాట్లాడుతూ, గత వైసిపి ప్రభుత్వం హాయంలో దీనిపై పోరాటం ఉధృతం చేయడంతో వెనక్కు తగ్గిందని, కూటమి ప్రభుత్వం తెరపైకి మళ్లీ తీసుకొచ్చి సుమారు 18 వందల మెగావట్లుతో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ తమ గ్రామంలో ఏర్పాటుకు ఈ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. అందులో భాగంగానే సర్వే బృందం పంపుతున్నట్లు తెలిసిందని, అందుకే అడ్డుకొనెందుకు గ్రామాల ప్రజలంతా ముక్తకంఠంగా తరిమికొట్టేందుకు సిద్ధం అయ్యామన్నారు. ఎట్టి పరిస్థితుల్లో హైడ్రో పవర్ ప్రోజెక్టు ఏర్పాటుకు అవకాశం ఇవ్వమని తరిమి కొడతామని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుతో తమ వ్యవసాయ భూములు నాశనమయ్యే ప్రమాదం ఉందని, అంతేకాకుండా చింత. మామిడి, పనస, జీడి వంటి తోటలు దెబ్బతిన్నె ప్రమాదం ఉందనితెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో అడుగుపెట్ట నివ్వమని స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో శంకర్, కన్నయ్య శ్రీను, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న పిఒ

ప్రజాశక్తి - రంపచోడవరం : ఆసుపత్రికి వచ్చిన రోగులకు వెంటనే వైద్యపరీక్షలు నిర్వహించి ఆయా వ్యాధులకు ఉచిత మందులు అందజేయాలని రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏరియా ఆసుపత్రికి మారుమూల గ్రామాల నుంచి వచ్చిన రోగులకు వెంటనే రక్తనమూనాలు స్వీకరించి మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ప్రస్తుతం ఎంతమంది రోగులు, గర్భిణులు, వైద్యాధికారులు ఉన్నదీ ఆరా తీశారు. సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని అదేవిధంగా ఏయే మందులు కావాలో ప్రతిపాదనలు అందించాలన్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం రంపచోడవరం మండలం పెదగెడ్డలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ భవనం నిర్మాణ పనులు పరిశీలించారు. భవనం త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

వ్యాధులపై అవగాహన కోసం డ్రై డే



డ్రమ్ముల్లో నిల్వ నీటిని పారబోస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - కొయ్యూరు: కొయ్యూరులో దోమల ద్వారా వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి శుక్రవారం డ్రై డే ఫ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సచివాలయం సిబ్బంది,ఎఎన్ఎంలు అంగన్‌వాడి కార్యకర్త, ఆశా వర్కర్ ఇంటింటికీ వెళ్లి ఇళ్ల పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని పరిశీలించి దోమల లార్వాను గుర్తించి డ్రమ్ముల్లో ఉన్న నిల్వనీటిని తొలగిస్తూ గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

నియోజకవర్గ పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస్‌యాదవ్



మాట్లాడుతున్న నియోజకవర్గ పరిశీలకులు శ్రీనివాస్ యాదవ్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: గ్రామస్థాయి నుండి పార్టీని బలోపేతం చేయడానికి పార్టీ నాయకులు, గ్రామ కన్వీనర్లు, క్లస్టర్ నాయకులు కృషి చేయాలని రంపచోడవరం నియోజకవర్గ టిడిపి పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకులు, బూత్‌లెవెల్ కమిటీ సభ్యులు, క్లస్టర్‌నేతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రానున్న స్థానికసంస్థలు ఎన్నికలు, కేడర్ ఏర్పాటుకు, టిడిపి మండల నాయకులతో పార్టీ అభివృద్ధి గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలను నిష్పక్షపాతంగా ప్రజలకు చేరే విధంగా నాయకత్వం కృషి చేయాలని సూచించారు. టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శ, ఉపాధ్యక్ష ఎన్నికలు ఈ నెల 14న రాజవొమ్మంగి పార్టీ కార్యాలయంలో జరుగుతాయ న్నారు. రానున్న అన్ని పంచాయతీల్లో అన్ని గ్రామాల్లో జడ్పిటిసి ఎంపీపీ సర్పంచులు, ఎంపిటిసిలు, వార్డు సభ్యులు 100 శాతం టిడిపి విజయం సాధించేలా పార్టీ పునర్వైభవం కోసం పార్టీ నాయకత్వం అంతా కలిసికట్టుగా ముందుకు సాగుతామని తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకుడు నారాయణస్వామి, రమేష్, అరకు పార్లమెంటు ఉపాధ్యక్షులు దంతులూరు శివ రామచంద్రరాజు, మార్కెట్‌యాడ్ కమిటి చైర్మన్ లోత లక్ష్మణరావు, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొల్లపూడి పెద్దిరాజు,ముప్పన డింభకేశ్వరరావు మాజీ సొసైటీ అధ్యక్షులు గణజాల తాతారావు, మాజీ ఎంపిపి రెడ్డి రమణ, ఎంపిటిసి నల్ల సత్తిబాబు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఒకేసారి రేషన్ పంపిణీ చేయాలి

-ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి- చింతపల్లి:గిరిజన సహకార సంస్థ (జిసిసి) ఆధ్వర్యంలో రేషన్ లబ్ధిదారులకు సరుకుల పంపిణీలో జిసిసి అధికారులు ఇబ్బందులు కలిగిస్తున్నారని ఆదివాసి గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని కొత్త వీధి గ్రామాన్ని ఆయన సందర్శించి రేషన్ లబ్ధిదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిసిసి పంపిణీ చేస్తున్న బియ్యం, సరుకులు, పంచదార వేర్వేరు రోజుల్లో ఇస్తున్నారని, దీంతో రేషన్ కార్డు లబ్ధిదారులు మళ్లీ మళ్లీ డిపోల చుట్టూ తిరగాల్సి వస్తోందని తెలిపారు. మండలంలో సుమారు 53 డిఆర్ డిపోలు ఉన్నా కొందరు సేల్స్ మెన్లు సరుకుల పంపిణీలో పూర్తిగా విఫలమవుతున్నారు. జిసిసి చైర్మన్, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి లబ్దిదారులకు ఒకేసారి సరుకులు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మండల కేంద్రంలో ధర్నాకు సిద్ధమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల నాయకులు మజ్జి రాంబాబు, రేషన్ లబ్ధిదారులు కొర్ర నారాయణరావు, గెమ్మెలి పొట్టన్న, కొర్ర రాంబాబు, బురిడీ గుండమ్మ, సమిరెడ్డి ఉల్లాసి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు



పూజలు చేస్తున్న హోం మంత్రి అనిత

మోదకొండమ్మకు హోం మంత్రి అనిత పూజలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లాలో శుక్రవారం హెూంమంత్రి వంగలపూడి అనిత పర్యటించారు. పాడేరులో హెూంమంత్రికి టిడిపి పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. పాడేరులో మోదకొండమ్మ అమ్మవారిని దర్శించికొని, ప్రత్యేక పూజులు చేశారు. ఆలయ మర్యాదలతో ఆలయ కమిటీ, అధికారులు హెూం మంత్రికి స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం పండితులు వేద ఆశీర్వచనం చేశారు. అనితకు అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అధికారులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గోవింద్ మాస్టారు, బొర్రా నాగరాజు, విజయరాణి, ఎస్ వి రమణ, సోనాయి రత్న కుమారి, డి.వెంకటరమణ (బుజ్జి), రాము, పార్వతమ్మ, శివ కుమార్, జ్యోతి కిరణ్, కుమారి, సుబ్బలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు

ప్రజాశక్తి- కొయ్యూరు: మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్‌శ్రీకాంత్‌తో కలిసి నాబార్డు జిల్లా అధికారి (డిడిఎం) గౌరీశంకరరావు డి.కొత్తూరులో శుక్రవారం ముందుగా ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. రక్షిత మంచినీటి పథకా న్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. అనంతరం మా తోట ప్రాజెక్టు కింద సోలార్ బోర్‌వెల్‌ను ప్రారంభించారు. పలువురు రైతులకు ఆయిల్ ఇంజన్లు, మేకలను పంపిణీ చేశారు. అనంతరం జీడిమామిడి, టేకు తోటలను పరిశీలిం చారు. రైతులకు పలు సూచనలు చేశారు. రైతులతో కలిసి జీడిమామిడి మొక్కలు నాటారు. జీవనోపాధి కల్పనలో భాగంగా పలువురు మహిళా లబ్ధిదారులకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. అనంతరం రాంకీ ఫౌండేషన్, సిఎస్ఆర్ నిధుల కింద మంజూరైన కూరగాయల విత్తనాలు, వాటర్‌ట్యాంకులు, గడ్డపారలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, రైస్‌మిల్లుల యంత్రసామగ్రిని లబ్ధిదారు లకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాతోట కమిటి సభ్యులు హరికృష్ణ, శ్రీనివాస్, రవి, సత్తిబాబు రైతులు పాల్గొన్నారు.

టవర్ ఉన్నా... సిగ్నల్స్ రావన్నా..!

ప్రజాశక్తి - కొయ్యూరు: కొయ్యూరు మండలం బాలారం పంచాయతీలో బిఎస్ఎన్ఎల్ సెల్‌టవర్ ఉంది. అయితే నాలుగు రోజులుగా సిగ్నల్స్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

విద్యార్థులకు స్వల్ప అస్వస్థత

ప్రజాశక్తి - ఎటపాక: గౌరిదేవిపేట హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులు స్వల్పఅస్వస్థతకు గురయ్యారు. వీరిని స్థానిక పిహెచ్‌సికి తరలించి చికిత్స చేశారు. అంతా బాగానే ఉన్నారని వైద్యులు దేవినాగ్ స్పష్టం చేశారు. అన్నం సరిగా ఉడకలేదని అందువల్లనే ఇబ్బంది పడ్డామని విద్యార్థులు తెలిపారు.

వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల
రద్దు ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలి


మాట్లాడుతున్న మాజీ మంత్రి బాలరాజు

ప్రజాశక్తి-చింతపల్లి: గిరిజన ప్రాంత విద్యార్థులు వ్యవసాయ శాస్త్రవేత్తలుగా ఎదిగి దేశ వ్యవసాయ రంగానికి మేలు చేయాలనే లక్ష్యంతో చింతపల్లిలో స్థాపించిన వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను రద్దు చేయడం దారుణమని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక పాత్రికేయులతో మాట్లాడుతూ, 2011లో చింతపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఈ కళాశాలను ఏర్పాటు చేసి గిరిజన ప్రాంత విద్యార్థులకు వ్యవసాయ రంగ విద్య అందించేందుకు తాము ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు గుర్తు చేశారు. విద్య, వైద్య సంస్థలతో పాటు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు చేయడం ద్వారా గిరిజన ప్రాంత అభివృద్ధికి బాటలు వేశామన్నారు. 2025–26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలను నిలిపివేయడం, పైగా ప్రభుత్వ నిర్ణయం లేకుండానే రైల్వేస్తు రద్దు ఉత్తర్వులు జారీ చేయడం సరికాదని ఆయన అన్నారు. తక్షణమే కళాశాలను పునరుద్ధరించాలని కోరారు. చింతపల్లి ప్రాంతం సహజసిద్ధంగా వ్యవసాయానికి అనుకూలమని, పాడి పరిశ్రమ, సిల్క్ ఫారం, పట్టు పరిశ్రమలను పునరుద్ధరించడంతో గిరిజనులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. రద్దు ఉత్తర్వులను వెనక్కి తీసుకోకపోతే విద్యార్థులు, తల్లిదండ్రులు, అన్ని రాజకీయ పార్టీలకు అతీతంగా ఉద్యమానికి సిద్ధమవుతామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో మాజీ ఎంపిపి ఎల్ ఉమ్మడి ఆజయ్, మాజీ ఎంపిటిసి సభ్యులు దేవుడు గిరిబాబు, మాజీ సర్పంచ్ చిన్నబ్బాయి, చెర్రికి పొట్టయ్య, పండ నాగరాజు, కుడుముల వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను తరలించడం సరికాదు

సీలేరు: విద్యార్థులు లేరనే సాకుతో సేంద్రియ వ్యవసాయ పాలిటెక్నికల్ కళాశాల తరలించడం సరికాదని జిల్లా కాంగ్రెస్ డిసిసి కార్యదర్శి కారే శ్రీనివాస్ విచారం వ్యక్తం చేశారు. స్థానిక విలేకరులతో ఆయన శుక్రవారం మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో అనుబంధంగా కొనసాగుతున్న సేంద్రియ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ఎక్కువమంది విద్యార్థులు చేరడం లేదనే నెపంతో ఆచార్య ఎన్.జి.రంగా యూనివర్సిటీ వారు తీసుకున్న నిర్ణయం సరైనది కాదని పేర్కొన్నారు. అన్ని రంగాల్లో వెనుకబడి ఈ ప్రాంతంలో ఉన్న ఒక్క సేంద్రియ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను తరలించాలనుకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. కొత్త వాటిని నెలకొల్పకుండా ఉన్న వాటిని తరలించుకుపోవడంతో ఈ ప్రాంతానికి అన్యాయం చేసినట్లేనని తెలిపారు. ఇటీవల అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సేంద్రియ వ్యవసాయ సాగు జిల్లాగా ప్రకటించిన నేపథ్యంలో చింతపల్లిలో సేంద్రియ వ్యవసాయ పాలిటెక్నికల్ కళాశాల కొనసాగిస్తే గిరి రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందన్నారు. జిల్లా పరిపాలనా అధికారులు ఆచార్య ఎన్‌జిరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు కళాశాల కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దోమల నివారణ మందు పిచికారీ


పిచికారీ చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-చింతపల్లి: వర్షాకాలం ప్రారంభం కావడంతో గ్రామాల్లో పరిశుభ్రతను కాపాడటం తో పాటు ఇంకుడు గుంతలు, మురుగు కాలువల వద్ద దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మలేరియా యూనిట్ అధికారి బుక్క చిట్టిబాబు సూచించారు. తాజంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పలు గ్రామాలలో పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ సమక్షంలో మలేరియా సిబ్బంది పిచికారీ పనులు చేపట్టారు. దోమల వృద్ధి చెందకుండా నివారించేందుకు పిచికారీ చాలా అవసరమని ఆయన తెలిపారు. రెండో విడత పిచికారీ కార్యక్రమంలో గ్రామస్తులు ఇంటింటికీ మందు వేయించుకోవాలని సూచించారు. చిన్నపాటి జ్వరాలు వస్తే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రక్త పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని చిట్టిబాబు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శాకాంబరి అవతారంలో దారాలమ్మ అమ్మవారు

ప్రజాశక్తి –సీలేరు: జికె వీధి మండలం దారకొండ ఘాట్‌రోడ్‌లో వెలసిన దారాలమ్మ అమ్మవారు శాకాంబరిదేవి అవతారంలో భక్తులకు శుక్రవారం దర్శనమిచ్చారు. ప్రతి ఏడాది ఆషాడ మాసంలో దారకొండ వాస్తవ్యులు వనమాల చెట్టి శ్రీనివాసు దంపతుల ఆధ్వర్యంలో పూజలు చేస్తారు. అమ్మవారిని రకరకాల కూరగాయలతో అలంకరించారు. ముందుగా అమ్మవారికి కుంకుమార్చన, పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



విత్తనాలు అందిస్తున్న సర్పంచ్ బొగ్గా వెంకమ్మ, ఎంపిటిసి అమ్మాజి

సబ్సిడీ వరి విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి- కూనవరం : ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఎఇఒ రమేష్ అన్నారు. కూటూరు పంచాయతీ సర్పంచ్ బొగ్గా వెంకమ్మ, ఎంపిటిసి అమ్మాజి ఆధ్వర్యంలో విత్తనాలు సరఫరా చేసారు. అధిక దిగుబడులు రావడంలో ఇవి తోడ్పడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి మేకల నాగేశ్వరావు, పంచాయితీ కార్యదర్శి నాగమల్లి, సోడె నాగేశ్వరావు, రైతులు పాల్గొన్నారు.

జివిఎంసి టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు11 వినతులు

ప్రజాశక్తి – ఎంవీపి కాలనీ: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కి సంబంధించి 11 వినతులు వచ్చాయని జివిఎంసి చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకారరావు తెలిపారు. శుక్రవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో సిపిలు, డిసిపిలు, ఎసిపిలతో కలిసి ప్రత్యేకంగా టౌన్‌ప్లానింగ్ ఓపెన్‌ఫోరమ్ కార్యక్రమం నిర్వహించారు.

రూ. వెయ్యి కోట్లతో జిల్లాలో రోడ్ల నిర్మాణాలు

గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి – పాడేరు : జిల్లాలో రూ.వెయ్యి కోట్లతో రహదారులను నిర్మిస్తున్నామని జిల్లా ఇంచార్జి మంత్రి గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొన్ని రోడ్ల నిర్మాణాలు పూర్తి చేసి ప్రారంభించామని మరి కొన్ని రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. శుక్రవారం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో చైతన్యం, గంజాయి సాగు రూపుమాపే లక్ష్యంగా నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 2 కోట్ల ఉద్యానవన మొక్కలను గిరిజన రైతులకు పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. గంజాయికి ప్రత్యామ్నాయంగా రైతులకు సిల్వర్, సపోటా, మామిడి, జామ, నేరేడు, నిమ్మ, పనస, సీతా ఫలం, జాఫ్రా మొక్కలను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఇంటిలో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికి తల్లికి వందనం అందిస్తున్నామని అన్నారు. జిల్లాలో 9 లక్షల జనాభా ఉంటే లక్ష బంగారు కుటుంబాలను (పేదలు) ఉన్నారని చెప్పారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని వారి అభివృద్ధికి తోడ్పాటు అందించాలని పిలుపు నిచ్చారు. పీ4 విధానంలో అందరూ భాగస్వామ్యం కావాలని చెప్పారు. 90 శాతం గంజాయి నిర్మూలన జరిగిందన్నారు. లక్ష ఎకరాల్లో కాఫీ విస్తరణకు చర్యలు చేపట్టామన్నారు.

రూ.3.73 కోట్ల ఆస్తులు జప్తు చేసాం : హోం మంత్రి వంగలపూడి అనిత

రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో అరకు, పాడేరు ప్రాంతానికి మంచి ప్రత్యేకత ఉందన్నారు. అమాయక గిరిజనులతో గంజాయి సాగు చేయిస్తున్నారని అన్నారు. గంజాయి సాగుపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందన్నారు. గంజాయి సాగు, రవాణా చేస్తున్న స్మగ్లర్ నుండి రూ.3 కోట్ల 73 లక్షల 80 వేల విలువైన ఆస్తులను జప్తు చేసామన్నారు. గంజాయితో పట్టుబడితే ఆరు నెలలు బెయిల్ రాదని అన్నారు. గంజాయి సాగు చేయడం, రవాణా చేస్తూ పట్టు బడితే 10 నుండి 20 ఏళ్ల జైలు శిక్ష పడుతుందన్నారు. ఇటీవల విశాఖపట్నం సెంట్రల్ జైలు సందర్శించినప్పుడు పరిశీలిస్తే తొమ్మిది వందల గంజాయి నేరస్తులుంటే వారిలో ఏడువందల మంది గిరిజన పిల్లలున్నారన్నారు. దళారులు గిరిజన రైతులను మోసం చేసి గంజాయి సాగు చేయిస్తూ గిరిజనులను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఏడాది 35 వేల ఎకరాల్లో పండ్ల తోటలు పెంపకానికి మొక్కలు పంపిణీ చేస్తున్నామన్నారు.

జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రూ.54 కోట్లతో 35 వేల ఎకరాలలో పండ్లతోటలు పెంపకానికి మొక్కలను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. రానున్న 3,4 ఏళ్ల లో లక్ష ఎకరాల్లో కాఫీ తోటలు పెంపకాన్ని విస్తిరిస్తున్నామన్నారు.


మొక్కను అందజేస్తున్న హోంమంత్రి అనిత

జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ మాట్లాడుతూ,ఆధునిక సాంకేతక పరిజ్ఞానం డ్రోన్ల సహాయంతో 93 ఎకరాల గంజాయి సాగును గుర్తించి నిర్మూలించడం జరిగిందన్నారు. గంజాయి సాగు చేస్తున్న 325 కుటుంబాలను గుర్తించి ప్రత్యామ్నాయ పంటలను అందిస్తున్నామని చెప్పారు. ఈగల్ క్లబ్లును ఏర్పాటు చేసి ప్రజలను చైతన్య వంతం చేస్తున్నామన్నారు. 1631 గ్రామాలలో గంజాయి నిర్మూలనపై అవగాహనా సదస్సులు నిర్వహించామన్నారు.

ఈగల్ ఐజి రవికృష్ణ మాట్లాడుతూ అల్లూరి సీతారామ గంజాయి సాగుపై రాష్ట్ర ప్రభుత్వ కఠినంగా వ్యవహిస్తోందన్నారు. గంజాయి సాగు, రవాణా పై 1972 టోల్ నంబరుకు సమాచారం అందించాలని సూచించారు. స్వచ్ఛ సంకల్పం గోడపత్రికను ఆవిష్కరించారు ఈ సమావేశంలో రంపచోడవరం ఎం ఎల్ ఎ మిరియాల శిరిషా, జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, విజయ నగరం రీజియన్ ఆర్టీసి చైర్మన్ దొన్నుదొర, జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, ఈగల్ ఎస్పీ కె.నగేష్ బాబు, మాజీ శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరి, జనసేన నేత వంపూరి గంగులియ్య ఐటిడి ఎ సహాయ ప్రాజెక్టు అధికారి వేంకటేశ్వరరావు, డ్వామా పిడి విద్యాసాగర్, జిల్లా వ్యసాయాధికారి ఎస్.బి. ఎస్ నంద్ పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఇలకు 'జిటెక్' సహకారం

ప్రజాశక్తి –మధురవాడ : చిన్న మధ్య తరహ పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందించడానికి గీతం టెక్నాలజీఎనేబిలింగ్ సెంటర్ (జిటెక్) సిద్ధంగా ఉందని జిటెక్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు తెలిపారు. ఎంఎస్ఎంఇ కనెక్ట్ –2025 పేరిట నగరంలోని ఒక హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలను కావాల్సిన నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడానికి భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం గీతంలో జిటెక్ పేరిట ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పిందన్నారు. జిటెక్ ద్వారా ఆహారశుద్ధి పరిశ్రమలకు అవసరమైన సాంకేతికతను అభివృద్ధి చేసి మిజోరాం, లడహక్ ప్రాంతాలలోని రైతులకు అందించామని, గెయిల్ తదితర పరిశ్రమలకు సాంకేతిక సహకారం అందిస్తున్నామన్నారు. గీతంతో సహ ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ విశ్వవిద్యాలయాలు, సాంకేతిక విద్యాసంస్థలలోని అధ్యాపకులు, పరిశోధకులు జిటెక్ ద్వారా పరిశ్రమలకు అవసరమైన సాంకేతికతను అభివృద్ధి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఒ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్‌వి.హరప్రసాద్, డిఎస్‌టి సభ్యుడు పి.రవికుమార్, భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక మాజీ సలహాదారు డాక్టర్ యోగేశ్వరరావు మాట్లాడారు. జాతీయ సముద్ర పరిశోధన సంస్థ (ఎన్ఐఒ) శాస్త్రవేత్త డాక్టర్ వివిఎస్ఎస్.శర్మ సముద్ర ఆహర పరిశ్రమలో నూతన ఆవిష్కరణల ప్రాధాన్యతను వివరించారు. గీతం విశిష్ట ప్రొఫెసర్ గురజాడ రవికుమార్ చిన్న మధ్యతర పరిశ్రమలకు బాబా అణుశక్తి పరిశోధన కేంద్రం అభివృద్ధి చేసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని వివరించారు. అరవిందో ఫార్మా సీనియర్ జనరల్ మేనేజర్ ఇ. సంపత్‌రెడ్డి పారిశ్రామిక వ్యర్థాలను శుద్ధి చేయడానికి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు.. కార్యక్రమంలో జిటెక్ నిపుణులు సోంభట్టు శాస్త్రి, డాక్టర్ చంద్రమౌళిపాల్గొన్నారు


మాట్లాడుతున్న జిటెక్ కోఆర్డినేటర్ రాజా ఫణిపప్పు

చర్మ రక్షణకు ఆయుర్వేద ఆహారం : డాక్టర్ మధుమితకృష్ణన్

ప్రజాశక్తి – ఎంవిపి కాలనీ: వర్షాకాలంలో, చర్మం నిస్తేజంగా, నిర్జీవంగా, ఎటువంటి మెరుపు లేకుండా కనిపిస్తుందని ఆయుర్వేద నిపుణులు డాక్టర్ మధుమితకృష్ణన్ అన్నారు. బీచ్ రోడ్‌లోని ప్రయివేటు హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సరైన చర్మ ఆరోగ్యాన్ని, అందించడానికి సరళమైన సహజ నివారణలను ఆశ్రయించాలని సిఫార్సు చేశారు. బాదం, హెర్బల్‌టీలు , పసుపు వంటి సహజ ఆహారాలను తీసుకోవాలన్నారు. ఆరోగ్యకరమైన చర్మానికి కీలకం మంచి జీవక్రియ అవసరమన్నారు. బాదంతో చర్మ ప్రకాశం పెరుగుతుందన్నారు. ఆహారంలో హెర్బల్ టీని వాడాలని, అల్లం, తులసి, చమోమిలే వంటి హెర్బల్‌టీలు శరీరాన్ని నిర్విషీకరణ (డిటాక్సిఫికేషన్), జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడతాయని ఆమె తెలిపారు

మత్స్యకార సంఘాల ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లాలో అవసరమైన ప్రాంతాలలో కొత్తగా మత్స్యకార సంఘాలు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల అధ్యక్షులు ఎం.గురునాధరావు తెలిపారు. మత్స్యశాఖ సహకార సంఘం ఆధ్వర్యాన యునైటెడ్ నేషన్స్ ఇయర్ ఆఫ్ కో–ఆపరేటివ్ – 2025 పురస్కరించుకొని జిల్లాలోని మత్స్య సహకార సంఘాల ప్రతినిధులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గురునాధరావు, జిల్లాలోని ప్రాథమిక మత్స్య సహకార సంఘాల వివరాలు, వాటి నిర్వహణ గురించి వివరించారు. మత్స్యశాఖ జెడి పి.లక్ష్మణరావు మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి ప్రవీణ, మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ మెట్రోకు సెప్టెంబర్‌లో శంకుస్థాపన : గండి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖలో మెట్రో ప్రాజెక్టుకు సెప్టెంబర్ నెలలో శంకుస్థాపన చేయనున్నట్లు టిడిపి జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కో–ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవెర్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జి తెలిపారు. శుక్రవారం జిల్లా టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, వైసిపి పాలనలో గంజాయి లక్షల ఎకరాలు ఉంటే కూటమి పాలనలో గణనీయంగా తగ్గిందన్నారు. సుమారు 300కు పైగా గ్రామాల్లో గంజాయి సాగును మాన్పించి, ఉద్యానవన పంటలు వేయించడం జరిగిందని చెప్పారు. విశాఖకు టిసిఎస్, గూగుల్, కాంటిజెంట్, క్యాప్ జెమిని వంటి సంస్థలు వస్తున్నాయని చెప్పారు. వైసిపి నేతలు విలేకర్లను, ఫొటోగ్రాఫర్లను ఇంటికి వెళ్లి కొట్టే పరిస్థితికి దిగజారిపోయారని విమర్శించారు.

ఐఎఫ్‌ఆర్, మిలాన్, అయాన్స్ కాన్‌క్లేవ్ వేడుకలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నేవల్ కమాండ్ ఆధ్వర్యాన ఫిబ్రవరి 2026లో జరగనున్న ఐఎఫ్ఆర్, మిలాన్, అయాన్స్ కాన్‌క్లేవ్ ఆఫ్ చీఫ్స్ వేడుకలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ పేర్కొన్నారు శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నేవీ, ఎయిర్ పోర్టు, పోర్టు అథారిటీ, కస్టమ్స్, రెవెన్యూ, విఎంఆర్‌డిఎ, జివిఎంసి, పోలీసు, పర్యాటక శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా విభాగాలు చేపట్టాల్సిన చర్యలపై సూచనలు చేశారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి వేడుకలను విజయవంతం చేయాలన్నారు. తొలుత కమోడో ఐఎఫ్ఆర్ ఎబి మాథ్యూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ శాఖల వారి విధులను వివరిస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు వారి సహకారాన్ని కోరారు. కార్యక్రమంలో నేవల్ ఆఫీస్ ఇన్‌ఛార్జి (ఆంధ్రప్రదేశ్) రజనీష్ శర్మ, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్, డిసిపిలు అజిత, మేరీ ప్రశాంతి, నేవల్ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


'బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ' విజయవంతం చేద్దాం

శాసనమండలి సభ్యులు బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి, ఎంవీపి కాలనీ: 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని శాసనమండలి సభ్యులు బొత్స సత్యనారాయణ అన్నారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో విశాఖపట్నం తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మెల్లి అప్పారావు ఆధ్వర్యంలో శుక్రవారం కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలపై చర్చించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 15 నియోజకవర్గాల వార్డు అధ్యక్షులు, కార్యకర్తలు ఒకే వేదికపై కలుసుకోవడం ఆనందదాయకమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా, ఒక్క హామీ కూడా అమలు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. చంద్రబాబు రాజకీయ జీవితంలో హామీలను నెరవేర్చిన సందర్భం లేదని విమర్శించారు. కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఉచితబస్సు సౌకర్యాన్ని జిల్లాలకే పరిమితం చేయడంపై ఇది న్యాయమా అని నిలదీశారు. గతంలో రుణమాఫీపై చేసిన మోసం మాదిరిగానే, ఇప్పుడు తెచ్చిన అప్పులు ఎలా వినియోగిస్తున్నారో ప్రజలకు తెలియడం లేదన్నారు. అనంతరం కె.కె.రాజు మాట్లాడుతూ వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో కుల, మత, పార్టీ భేదాలు లేకుండా అర్హులకు సంక్షేమ పథకాలు అందినట్లుగా గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఎల్లో మీడియా ద్వారా జగన్‌పై తప్పుడు ఆరోపణలు చేసి, ప్రజలను తప్పుదోవ పట్టించారన్నారు. అధికారంలోకి వచ్చాక హామీలను అమలు చేయకుండా, వైసిపి నాయకులపై తప్పుడు కేసులు పెట్టి కుట్ర రాజకీయాలు చేస్తుండటం దుర్మార్గమన్నారు. సమావేశంలో శాసనమండలి సభ్యురాలు వరుదు కళ్యాణి, మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి, రాష్ట్ర అనుబంధ అధ్యక్షులు పెర్ల విజయ్‌చంద్ర, మహంతి గొలగాని శ్రీనివాస్, మార్కండేయులు, తదితరులు పాల్గొన్నారు.

19న తలసేమియా రన్

ప్రజాశక్తి, ఎంవిపి కాలనీ: ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ శనివారం సాయంత్రం 6 గంటలకు నగరంలోని ఆర్కే బీచ్ రోడ్డులో 3కె, 5కె, 10కెరన్ నిర్వహించనున్నట్లు ట్రస్ట్ సిఇఒ కె.రాజేంద్రకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఓ ప్రైవేట్‌హోటల్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తలసేమియా బాధితులకు మద్దతు తెలిపే గొప్ప లక్ష్యంతో ఈ రన్‌ను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు వారి జన్మతహ వచ్చే జన్యుపరమైన వ్యాధివల్ల వారిలో రక్తం తయారు కాదన్నారు. వారికి ప్రతి 21 రోజులకు ఒకసారి తప్పనిసరిగా రక్తం ఎక్కించి వారిని బ్రతికించుకోవాలన్నారు. యువత పెళ్ళికి ముందు జన్యుపరీక్షలు చేయించుకోవడం ద్వారా దీన్ని వ్యాప్తిని కొంతవరకు నిరోధించవచ్చున్నారు. ప్రజలందరూ ఈ తలసేమియా రన్ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపు నిచ్చారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా విద్య, వైద్యం, విపత్తుల సమయంలో సహాయం, ఉపాధి కల్పన వంటి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని ఆయన గుర్తు చేశారు. ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ అధికారి గోపి అదుసూపల్లి మాట్లాడుతూ ఎన్టీఆర్‌ట్రస్ట్ ఇప్పటికే 25 పడకల సామర్థ్యంతో ప్రత్యేకంగా తలసేమియా కేంద్రాన్ని ప్రారంభించిందన్నారు. కార్యక్రమానికి ప్రముఖ క్రీడాకారిణి కరణం మల్లీశ్వరి గ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారన్నారు. ఆ రోజు బీచ్‌రోడ్‌లో సింగర్ సమీర్ భరద్వాజ్‌తో మ్యూజికల్ నైట్ నిర్వహిస్తున్నామన్నారు.



ఎన్టీఆర్ ట్రస్ట్ సిఇఒ కె.రాజేంద్రకుమార్ తదితరులు

ఉడకని అన్నం పెట్టడంపై
తల్లిదండ్రుల మండిపాటు

ప్రజాశక్తి –అనంతగిరి: మండలంలోని ఉన్న ఆశ్రమోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో గురువారం జరిగిన మెగా పేరెంట్స్ సమ్మేళన కార్యక్రమంలో హాజరైన విద్యార్థిని తల్లిదండ్రులకు ఉడకని అన్నం పెట్టడంతో ఆయా పాఠశాలల హెచ్ఎం, వార్డెన్‌లపై తల్లిదండ్రులు మండిపడ్డారు. పలు పాఠశాలలో జరిగిన సమావేశం అనంతరం మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థిని తల్లిదండ్రులకు ఏర్పాటుచేసిన భోజనాలలో ఉడుకి ఉడకని అన్నంతో పాటు రుచికరం లేని భోజనాలు పెట్టడంతో పాఠశాల యాజమాన్యం పై తల్లిదండ్రులు మండిపడ్డారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన భోజన సదుపాయాలు కల్పించాలని ఆదేశిస్తున్నప్పటికీ పాఠశాల హెచ్ఎం, వార్డెన్ లు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఇటువంటి భోజనాలు పెట్టడంతో తమ పిల్లలకు అనేకమైన రోగాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పాఠశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థులకు నాణ్యమైన విద్య తో పాటు భోజనం అందించాలని తల్లిదండ్రులు కోరారు.

పిజిఆర్ఎస్‌లో128 వినతులు


ఫిర్యాదులను స్వీకరిస్తున్న అధికారులు,

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఐటిడిఎలో శుక్రవారం నిర్వహించిన మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థకు 128 వినతులు అందాయి. గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ఉప కలెక్టర్, ఇంచార్జి డిఆర్ ఒ ఎంవిఎస్ లోకేశ్వరరావు వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఫిర్యాదులను స్వకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్జీదారులు 1100 టోల్ నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదులు ఎక్కడ ఏస్థాయిలో ఉన్నాయో తెలుసుకోవచ్చన్నారు. అధికారులు అర్జీదారుల సమస్యలు పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. హుకుంపేట మండలం బూర్జ పంచాయతీ ఎంపిటిసి మజ్జి హరి జాకరవలస నుండి సొంటరిపాడు గ్రామం వరకు రోడ్డు నిర్మించాలని, కొయ్యూరు మండలం బూదరాళ్ల పంచాయతీ పిట్టలపాడు గ్రామంలో 70 కుటుంబాలు జీవిస్తున్నాయని, 40 మంది పిల్లలు ఉన్నారని పాఠశాల ఏర్పాటు చేయాలని మర్రి చంటిబాబు, ఎస్ ముత్యాలమ్మ తదితరులు దరఖాస్తులను అందజేసారు. జికె వీధి మండలం వంచుల పంచాయతీకి చెందిన ఆర్ కె రాజు, అంగన్వాడీ భవనం నిర్మించానని మూడవ విడత బిల్లులు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమాధికారి జి.జనార్ధనరావు, జిల్లా ట్రెజరీ అధికారి ఆర్.ప్రసాదరావు, జిల్లా ఉద్యాన వన అధికారి ఎ.రమేష్ కుమార్ రావు, డిపిఒ పిస్ కుమార్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత

ప్రజాశక్తి-చింతపల్లి: వర్షాకాలం ప్రారంభమైనందున జలుబు, జ్వరాలు, డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లోతుగడ్డ పంచాయతీ కార్యదర్శి రవికుమార్ తెలిపారు. చింతపల్లి మండలంలోని బందబయలు గ్రామంలో శుక్రవారం జరిగిన డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో మాట్లాడారు. ఆరోగ్యశాఖ సిబ్బందితో కలిసి ఇంటింటి సర్వే నిర్వహించి మురుగు నీటి నిల్వలు, డ్రైన్లు, టైర్లు, డబ్బాలు వంటి దోమల ఉత్పత్తి కేంద్రాలను గుర్తించి శుభ్రం చేశారు. గ్రామంలో ఉన్న మంచి నీటి ట్యాంకును క్లోరోక్విన్‌తో శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు తమ ఇళ్ల చుట్టూ నీటి నిల్వలు ఏర్పడకుండా చూడాలని, ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని రవికుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



క్లోరినేషన్ చేస్తున్న సిబ్బంది


సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మిపై తప్పుడు ప్రచారం తగదు

- వైసిపి నాయకులు

గంగవరం – ప్రజాశక్తి: రంపచోడవరం నియోజకర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేసిన తమ నాయకులపై మండల కూటమి నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలు మానుకోవాలని రంపచోడవరం నియోజకవర్గ ఎస్సి సెల్ అధ్యక్షులు తాతపూడి ప్రకాశ్, వైసిపి మండల అధ్యక్షులు యెజ్జు వెంకటేశ్వరరావు హితవు పలికారు. శుక్రవారం మండల వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రంపచోడవరం నియోజకవర్గ ఎస్సి సెల్ అధ్యక్షులు తాతపూడి ప్రకాశ్ మాట్లాడుతూ ఏజెన్సీలో ప్రతీ గిరిజనుడి అభివృద్ధికి వైసిపి ఏమి చేసిందో తెలుసునని, మా మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మిపై కూటమి నాయకులు విమర్శలు చేయడం సరికాదన్నారు. గడిచిన ఐదేళ్లల్లో రంపచోడవరం నియోజకవర్గంలో రహదారులు, గ్రామల్లో మౌలిక వసతుల కల్పన, గిరిజనుల సంక్షేమానికి, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. వైసిపి మండల అధ్యక్షులు యెజ్జు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలని సూచించారు. ఎంపిపి పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పిటిసి బేబీ రత్నం, వైస్ ఎంపిపి గంగాదేవి, ఎంపిటిసిలు వెంకటలక్ష్మి, కనకలక్ష్మి, సర్పంచులు అక్కమ్మ, లక్ష్మి, మండల ఇన్‌ఛార్జ్ రఘున్యాద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ రత్నమాణిక్యం

ఆరోగ్య సౌకర్యాలతో జనాభా పెంపు

ప్రజాశక్తి-చింతూరు: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆర్థిక శాస్త్ర విభాగం అధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నమాణిక్యం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో సుమారు 146 కోట్ల జనాభాతో ప్రపంచంలో మొదటి స్థానంలో ఉందన్నారు. మానవాభివృద్ధి సూచిలో మాత్రం వెనుకబడిఉందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ శేఖర్ మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వై.పద్మ, అప్పనమ్మ కె.శకుంతల, హారతి, శైలజ, రామ్‌మోహన్‌రావు జి.సాయికుమార్, బి.శ్రీనివాసరావు, విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

స్క్రీన్ అకాడమీ ప్రారంభం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూప్ అండ్ స్క్రీన్ అకాడమీని ప్రారంభించినట్లు అకాడమీ ప్రతినిధి విశాఖలో తెలిపారు. ఇది లాభాపేక్షలేని, భారతీయ సినిమాల్లో ఉత్తేజకరమైన కొత్త స్వరాలను పెంపొందిస్తుందని, ప్రదర్శిస్తుందని తెలిపారు. కేన్స్, ఆస్కార్ విజేతలు గుణీత్ మొంగా, పాయల్ కపాడియా, రేసుల్ పూకుట్టిలతో సహా విభిన్న సభ్యుల ఉత్తేజకరమైన, వేగంగా అభివద్ధి చెందుతున్న జాబితాతో దేశం అగ్ర చిత్ర సంస్థలతో కలిసి అకాడమీ పనిచేస్తుందన్నారు. స్క్రీన్ అకాడమీ ఏటా వారి ఫిల్మ్ స్కూల్స్ నామినేట్ చేసిన విద్యార్థులకు పోస్ట్ గ్రాడ్యుయేట్ ఫెలోషిప్‌లను అందిస్తుందన్నారు. దరఖాస్తు ప్రక్రియ వివరాల కోసం డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు డాట్ స్క్రీన్ అకాడమీ డాట్ ఒఆర్‌జిని సందర్శించాలని సూచించారు.